సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 1 । మే । 2023



ఒంటికి యోగా మంచిదేగా..
సాగరతీరంలో ఆదివారం యోగా చైతన్య సంస్థ ఆధ్వర్యంలో యోగా ఉత్సవం ఘనంగా జరిగింది. 8లో



ఇంధన పొదుపు.. 8లో
హిందూస్థాన్ పెట్రోలియం ఆధ్వర్యంలో సాక్ష్యం–2023 పేరిట ఆదివారం సాగరతీరంలో సైకిల్‌థాన్ నిర్వహించారు.



రాజకీయాలంటే ప్రజలతో...
రాజకీయం అంటే ప్రజలతో పెనవేసుకుపోయే బంధమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు సిద్ధార్థరెడ్డి తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే గుర్తింపు రద్దు

విశాఖ విద్య: వేసవి సెలవుల్లో ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో తరగతులు నిర్వహించినట్లయితే గుర్తింపు రద్దు చేస్తామని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఉమారాణి హెచ్చరించారు. నగరంలో కొన్ని కాలేజీల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి వాటిపై నిఘా పెట్టామన్నారు. అలాగే కాలేజీల్లో ఎటువంటి అడ్మిషన్లు కూడా చేపట్టడానికి వీల్లేదన్నారు.

నేడు ఏయూ ఇంజినీరింగ్ ఎచీవర్స్ డే

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎచీవర్స్ డే వేడుకలు సోమవారం నిర్వహించనున్నారు. బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించి, విద్యార్థులకు నియామక పత్రాలను అందజేస్తారు. ఈ విద్యా సంవత్సరంలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు 1,500 వందలకు పైగా ఉపాధి అవకాశాలు లభించాయి. మరికొన్ని సంస్థలు నియామకాలకు సంబంధించిన ఫలితాలను వెలువరించాల్సి ఉంది.

నేడు జీవీఎంసీ స్పందన

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం 'స్పందన' నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

గిడ్డంగుల వినియోగంలో పైపైకి..

- బెస్ట్ వేర్‌హౌసింగ్ సిటీగా విశాఖ కీలక పాత్ర
- మెట్రో నగరాల కంటే మిన్నగా.. హైదరాబాద్‌ను మించి పురోగతి
- లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం

అంతర్జాతీయ పారిశ్రామిక, వాణిజ్య అవకాశాలను సద్వినియోగం చేసుకుని.. రాష్ట్రంలో లాజిస్టిక్ హబ్‌గా విశాఖపట్నం రూపాంతరం చెందుతోంది. దేశంలోని మెట్రో సిటీలను తలదన్నేలా గిడ్డంగుల వినియోగంలో వృద్ధి రేటు నమోదు చేసి.. బెస్ట్ వేర్ హౌసింగ్ సిటీగా కీలక పాత్ర పోషిస్తోంది. విశాఖలో రాబోతున్న రెండు లాజిస్టిక్ హబ్స్ నిర్మాణాలు పూర్తయితే.. భవిష్యత్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా మారనుంది. – సాక్షి, విశాఖపట్నం



గాజువాక ఆటోనగర్‌లో వేర్ హౌస్

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. అందుకు కావాల్సిన వనరులు, వసతులను ఆయా నగరాల్లో కల్పించేందుకు అడుగులు వేస్తోంది. మరోవైపు ఉన్న వనరులను వినియోగించుకుని.. గిడ్డంగుల వినియోగంలో దేశంలోని ప్రధాన నగరాలతో విశాఖపట్నం పోటీ పడుతోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 0.3 మిలియన్ చదరపు అడుగుల గిడ్డంగుల లావాదేవీలు విశాఖపట్నంలో నమోదయ్యాయి. 2021–22లో కేవలం 0.1 మిలియన్ చదరపు అడుగులు మాత్రమే వినియోగించగా.. 2022–23లో మాత్రం ఏకంగా రికార్డు స్థాయిలో 228 శాతం వృద్ధి సాధించింది.

హైదరాబాద్ కంటే మిన్నగా..

గోదాముల వినియోగంలో విశాఖ నమోదు చేసిన వృద్ధిని ఏ ఇతర ప్రధాన మెట్రో నగరాలూ నమోదు చేయలేకపోవడం గమనార్హం. దేశంలోని 8 అగ్రశ్రేణి మార్కెట్లను మించి విశాఖలో వేర్ హౌసింగ్ ఊపందుకుంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కీలక నగరంగా భావించే హైదరాబాద్ కూడా విశాఖకు ఏమాత్రం దరిదాపులకు రాలేకపోయింది. భాగ్యనగరంతో పోలిస్తే 100 శాతం అధికంగా వినియోగం జరిగింది. 2022–23లో హైదరాబాద్ 128 శాతం వృద్ధిని నమోదు చేసింది. పుణేలో 166 శాతం మాత్రమే జరిగింది. టైర్–1 నగరాల్లో ప్రాథమిక మార్కెట్లలో 62 శాతం గ్రోత్ రేట్ ఉండగా.. టైర్–2 నగరాల్లో 31 శాతం పెరుగుదల కనిపించింది.

2022-23లో వృద్ధి నమోదు

విశాఖ	228%
పుణే	166%
హైదరాబాద్	128%

మరో రెండు మల్టీ మోడల్ పార్క్‌లు

గోదాముల వినియోగంలో దూసుకుపోతున్న విశాఖ భవిష్యత్‌లో మరింత కీలకంగా మారనుంది. తూర్పు తీరంలో పొడవైన తీర రేఖ కలిగిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు లాజిస్టిక్ రంగమే కీలకమైందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్య సంబంధాలు నెరిపేందుకు మన తీరప్రాంతం.. ముఖ్యంగా విశాఖపట్నం అనుకూలమని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో లాజిస్టిక్ మౌలిక వసతులు అభివృద్ధి పరచాలని నిర్ణయించారు. విశాఖలో ఏపీఐఐసీకి చెందిన 389.14 ఎకరాల్లో లాజిస్టిక్ పార్కును ఏర్పాటు చేయనున్నారు. ఇది జాతీయ రహదారికి 8 కి.మీ దూరంలో, విశాఖ పోర్టుకు 33 కి.మీ దూరంలో ఉంది. ఈ లాజిస్టిక్ పార్క్ కేంద్రంగా విదేశాల నుంచి ఎగుమతులు, దిగుమతులకు సౌలభ్యంగా ఉంటుంది. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల పారిశ్రామిక అవసరాలకు ఈ లాజిస్టిక్ పార్క్ కేంద్ర స్థానంగా మారనుంది. దీంతో పాటు విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) ఆధ్వర్యంలో రూ.100 కోట్ల వ్యయంతో మరో లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఈ ప్రాంతంలో కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రోత్సాహకరంగా ఉండటమే కాకుండా.. ఉపాధి అవకాశాలు భారీగా పెరగనున్నాయి.

ప్రధానాంశాలు

- 2021-22లో విశాఖలో గోదాముల వినియోగం- 0.1 మిలియన్ చ.అ.
- 2022-23లో గోదాముల వినియోగం - 0.3 మిలియన్ చ.అ.
- 389.14 ఎకరాల్లో లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- పోర్ట్ ఆధ్వర్యంలో మరో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్‌కు ప్రణాళికలు
- ఇవి పూర్తయితే వేర్ హౌసింగ్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా విశాఖ!

బీచ్ శుభ్రత.. అందరి బాధ్యత





చెత్త ఏరుతున్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వివిధ శాఖ ఉద్యోగులు

కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: జోడుగుళ్లపాలెం బీచ్ క్లీనింగ్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. కలెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ కె.ఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సి.ఎం సాయికాంత్ వర్మ, డీఈవో ఎ.చంద్రకళ, కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది, డూట్ కళాశాల విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. జోడుగుళ్లపాలెం తీరం నుంచి తెన్నేటి పార్కు దిగువన బీచ్ భాగం వరకు సుమారు అర కిలోమీటరు పరిధిలో శుభ్రం చేశారు. ఇసుక దిబ్బల్లో కూరుకుపోయిన చెత్త, దుస్తులు, ప్లాస్టిక్ సంచులు, ఖాళీ కొబ్బరి బొండాలు, వాటర్ బాటిళ్లు, పేపర్ ప్లేట్లను సేకరించారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ఇసుక దిబ్బలు అంచున రాళ్ల మధ్య కూరుకుపోయిన దుస్తులను బయటకు తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీచ్ క్లీనింగ్‌లో సుమారు 600 మంది వరకు పాల్గొని 11 టన్నుల చెత్త సేకరించామన్నారు. ఈ చెత్తను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అప్పగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. బీచ్‌ను శుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పిలుపునిచ్చారు.

నా కెరీర్‌లో మైలురాయిగా 'ఉగ్రం'

హీరో అల్లరి నరేష్



మాట్లాడుతున్న హీరో అల్లరి నరేష్. చిత్రంలో హీరోయిన్ మిర్నా మీనన్

డాబాగార్డెన్స్: 'ఉగ్రం' తన సినీ కెరీర్‌లో ఓ హైలెట్ చిత్రంగా నిలిచిపోతుందని ఆ చిత్ర హీరో అల్లరి నరేష్ స్పష్టం చేశారు. ఈ చిత్రం సూపర్ హిట్ అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. నగరంలో ఆదివారం చిత్ర యూనిట్ సందడి చేసింది. నాంది చిత్రం తర్వాత హీరో అల్లరి నరేష్, దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందించిన చిత్రమే ఉగ్రం. అల్లరి నరేష్‌కు జతగా మిర్నా మీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో నరేష్ మాట్లాడుతూ తన 60వ చిత్రం ఉగ్రంతో మీ ముందుకు వస్తున్నానన్నారు. నాంది సినిమాకు మించి ఈ చిత్రం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా మిస్సింగ్ కేసుల నేపథ్యంలో ఎంతో ఆసక్తిగా సాగుతుందన్నారు. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో 1.5 లక్షల మంది కనిపించకుండా పోయారనే విషయం తెలిసిందేనని, వారంతా ఏమయ్యారో ఇప్పటికీ తెలియదంటూ రూపొందించిందే ఉగ్రం చిత్రమని పేర్కొన్నారు. ఈ నెల 5న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు నరేష్ తెలిపారు. మిస్సింగ్ కేసులు పరిష్కరించే పోలీస్ పాత్రలో నటించానని, ఇప్పటి వరకు ఇటువంటి పాత్ర చేయలేదన్నారు. హీరోయిన్ మిర్నా మీనన్ మాట్లాడుతూ తెలుగులో ఇది తనకు రెండో చిత్రమన్నారు. అల్లరి నరేష్ చాలా అద్భుతంగా నటించారని చెప్పారు. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందించగా, కెమెరామన్‌గా సిద్ వ్యవహరించారన్నారు.

మూడు కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: జిల్లాలో ఆదివారం మూడు కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 178 మందికి పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం కేసుల సంఖ్య 33. 6 గురు డిశ్చార్జ్ అయ్యారని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

పాలిసెట్‌కు ముగిసిన గడువు

12, 568 మంది దరఖాస్తు



జిల్లా కన్వీనర్ నరసింహారావు

మురళీనగర్: పాలిసెట్ దరఖాస్తు గడువు ఆదివారం సాయంత్రంతో ముగిసింది. గడువు ముగిసే సమయానికి విశాఖ జిల్లా నుంచి 12,568 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పాలిసెట్ జిల్లా కన్వీనర్ కె.డి.వి.నరసింహారావు తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ పరిధిలో 11,629 మంది, భీమునిపట్నం పాలిటెక్ పరిధిలో 939 మంది పాలిసెట్–2023కు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ఈ నెల 10న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లాలో 38 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులతో మొత్తం 120 మార్కులకు పేపర్ ఉంటుంది.

జిల్లాలో సీట్ల వివరాలివీ..

జిల్లాలో నాలుగు ప్రభుత్వ, 11 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. కంచరపాలెం, పెందుర్తిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, కంచరపాలెంలో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల (గైస్), భీమిలిలో ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో 1,286 సీట్లు, ప్రైవేట్ కళాశాలల్లో 5,255 సీట్లు.. మొత్తంగా 6,541 సీట్లు ఉన్నాయి.

రెండో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై రెండో విడత చందనం అరగదీత ఆదివారం నుంచి శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈనెల 5వ తేదీన వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సమర్పించనున్న మూడు మణుగుల పచ్చి చందనం(120కిలోలు) కోసం ఈ అరగదీతను చేపట్టారు. ఆలయ బేడామండపంలో సుమారు 15 మంది సిబ్బంది సుమారు 30 కిలోలు చందనాన్ని అరగదీశారు. మరో మూడు రోజులపాటు చందనం అరగదీత చేపట్టనున్నారు.

మహిళా హాకీ జట్టుకు కిట్ల అందజేత



సబ్‌జూనియర్ జట్టుతో అప్పారావు తదితరులు

విశాఖ స్పోర్ట్స్: భువనేశ్వర్‌లో జరగనున్న సబ్ జూనియర్ బాలికల నేషనల్ మీట్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఆదివారం కిట్లను అందజేశారు. హాకీ విశాఖ ఆధ్వర్యంలో సాలిగ్రామపురం హాకీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎస్.కె.ఈ అప్పారావు జట్టు సభ్యులకు కిట్లతో పాటు సెఫ్టీ ఎక్విప్‌మెంట్‌ను అందించారు.

టాటానగర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: రూర్కెలా–ఝార్సుగూడ సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఆదివారం టాటానగర్‌లో బయలుదేరాల్సిన టాటానగర్–ఎర్నాకుళం(18189) ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో 3న ఎర్నాకుళంలో బయలుదేరాల్సిన ఎర్నాకుళం–టాటానగర్ (18190) ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,930
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,850
వెండి(కిలో):	రూ.80,400

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.122
స్కిన్	: రూ.214
స్కిన్‌లెస్	: రూ.224

రాజకీయాలంటే ప్రజలతో మమేకం



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

- విలువలకు పెద్దపీట వేసిన వైఎస్సార్ కుటుంబం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ

సబ్బవరం: రాజకీయం అంటే సంక్షేమం, అభివృద్ధి మాత్రమే కాదని ప్రజలతో పెనవేసుకుపోయే బంధమని కొత్తభాష్యం తీసుకొచ్చింది వైఎస్సార్ కుటుంబం మాత్రమేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తెలిపారు. నూతనంగా నియమితులైన వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ అభినందన సభ, ప్రమాణ స్వీకార కార్యక్రమం సబ్బవరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు తనకు బ్రహ్మరథం పడుతున్నారంటే దానికి కారణం తమ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పనులు చేసి ఓట్లు అడగాలని తాము అనుకుంటే.. మిగిలిన పార్టీలు అబద్ధపు హామీలు, అనైతిక పొత్తులు, ప్రభుత్వంపై బురద చల్లే కార్యక్రమాల ద్వారా ఓట్లు అడగాలనుకుంటున్నాయని ఎద్దేవా చేశారు. చిత్తశుద్ధితో ఏ పనిచేసినా ప్రపంచం మెచ్చుకుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ బాగుండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తుంటే... చంద్రబాబు తాను, తన పరివారం బాగుండాలని ఆలోచన చేస్తుంటారన్నారు. చంద్రబాబు తన హయాంలో టెంపరరీ పనులు చేపట్టారు కాబట్టే ప్రజలు టీడీపీని పక్కన పెట్టారన్నారు. చంద్రబాబు పచ్చ మీడియా సహకారంతోనే నెట్టుకొస్తున్నారు తప్పా ప్రజల్లో ఆదరణ లేదన్నారు. తమ ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో రూ.2 లక్షల 4 వేల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో వేసిందని గుర్తు చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవని చంద్రబాబు వంచన చేసే మాటలు చెబుతున్నాడని.. ఆయన హయాంలో తమ ప్రభుత్వంలో కంటే ఒక్క ఉద్యోగం ఎక్కువ ఇచ్చినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేసి వెళ్లిపోతానన్నారు.

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ తాను రాజకీయ ప్రవేశం చేసిన నాటి నుంచి పాలిశెట్టి సురేష్‌రాజ్ తన వెన్నంటే ఉండి పార్టీకి సేవలందించారన్నారు. తాను ఈ రోజు ఇలా ఉన్నానంటే అందుకు కారణమైన నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. ముందుగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి అదీప్‌రాజ్ వైఎస్ విగ్రహానికి పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బైరెడ్డిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, పరవాడ జెడ్పీటీసీ సన్యాసిరాజు, పార్టీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ సంఘ నూతన కార్యవర్గం

విశాఖ స్పోర్ట్స్: జిల్లా వాలీబాల్ సంఘం సర్వ సభ్య సమావేశం ఆదివారం గోపాలపట్నంలో జరిగింది. ప్రస్తుత సంఘ కాలపరిమితి పూర్తికావడంతో సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎమ్మెల్యే పి.వి.జి.ఆర్.నాయుడు(గణబాబు) తిరిగి ఎన్నికవ్వగా.. కార్యదర్శిగా కె.ఆర్ ఆనందకుమార్, కోశాధికారిగా కె.చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుతానికి ఈ మూడు పదవులకే ఎన్నిక జరిగిందని, మరోసారి సర్వ సభ్య సమావేశం నిర్వహించి పూర్తిస్థాయిలో కార్యవర్గం ఏర్పాటు చేస్తామని గణబాబు చెప్పారు.

తేలనున్న కాలేజీల లెక్క

- ప్రైవేటు జూనియర్ కాలేజీల తనిఖీకి త్రీమెన్ కమిటీ
- ఉమ్మడి విశాఖలో నాలుగు బృందాల ఏర్పాటు
- నిబంధనలు పాటిస్తేనే ప్రవేశాలకు అనుమతి



విశాఖలోని ఆర్ఐవో కార్యాలయం

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ కోర్సు ప్రాధాన్యత దృష్ట్యా జూనియర్ కాలేజీల నిర్వహణపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. నిబంధనలు పాటించని కాలేజీల్లో ప్రవేశాలకు అనుమతి ఇవ్వడానికి వీల్లేదని స్పష్టం చేసింది. గుర్తింపు కోసం ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీ యాజమాన్యాలు ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తుల్లో వాస్తవమెంతనేది సమగ్ర పరిశీలన చేసేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. 2023–24 విద్యా సంవత్సరంలో జూన్ 1న ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించాల్సి ఉన్నందున, ఈలోగానే ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో తనిఖీలు పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

త్రీమెన్ కమిటీతో వాస్తవికత

ప్రభుత్వ ఆదేశాలతో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో తనిఖీలపై ఈ సారి నిశిత పరిశీలన చేసేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఆర్ఐవో/డీవీఈవో, ఒక ప్రిన్సిపాల్, ఒక సీనియర్ ఫిజిక్స్/జువాలజీ లెక్చరర్లతో కూడిన త్రీమెన్ కమిటీ నియమించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు కమిటీలు ఏర్పాటు చేశారు. వీరు ఏ కాలేజీలను తనిఖీ చేయాలనేది నేరుగా కమిషనరేట్ నుంచి సమాచారం ఇవ్వనున్నారు. తనిఖీ సమయంలో త్రీమెన్ కమిటీలో ఉన్న ముగ్గురు అధికారులు, తాము క్షేత్రస్థాయిలో చూసిన పరిస్థితులపై వేర్వేరుగా తమ నివేదికను ఆన్‌లైన్ ద్వారా నేరుగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా ముగ్గురు అధికారులు ఇచ్చిన నివేదికను బేరీజు వేసుకున్న తర్వాతనే ఆయా కాలేజీల్లో ప్రవేశాలకు అనుమతి ఇవ్వనున్నారు.

నివేదిక మేరకే..: ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 2022 – 23 విద్యా సంవత్సరానికి 382 జూనియర్ కాలేజీలు ఇంటర్మీడియట్ బోర్డు వద్ద నమోదయ్యాయి. వీటిలో 21 కాలేజీలు నిర్వహణలో లేవు. 13 కాలేజీల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరగలేదు. 6 కళాశాలల్లో మొదటి, రెండో సంవత్సరం అడ్మిషన్లు కూడా లేవు. ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో విశాఖపట్నంలో 151, అనకాపల్లిలో 77, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 కాలేజీలు ఉన్నాయి. త్రీమెన్ కమిటీలు వీటిని తనిఖీ చేసి, ఇచ్చిన నివేదిక మేరకు 2023 – 24 విద్యా సంవత్సరంలో ఎన్ని కాలేజీలు నిర్వహణలో ఉంటాయనే లెక్క తేలనుంది.

నిబంధనలు పాటించాల్సిందే..

కాలేజీ నిర్వహణకు అనువైన భవనాలు, దీనికి సంబంధించిన వాస్తవ ధ్రువీకరణ పత్రాలు, ఫైర్ సేఫ్టీ, ఆట స్థలం, సైన్సు ల్యాబ్, అర్హత కలిగిన అధ్యాపకులు ఎంతమంది ఉన్నారనేది కమిటీ పూర్తిస్థాయిలో పరిశీలించనుంది. వీటికి సంబంధించి లేటెస్ట్ ధ్రువపత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకునేలా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. ఇందుకోసమని నిర్దిష్ట ప్రొఫార్మా రూపొందించారు. తనిఖీలో గుర్తించిన అంశాలను బృందం సభ్యులు ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. లోపాలు సరిచేసుకునేలా ముందస్తు నోటీసు ఇచ్చిన అనంతరం, అన్ని రకాల నిబంధనలు పాటించిన కాలేజీలకే 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి ఇవ్వనుంది.

ఒంటికి యోగా మంచిదేగా..



యోగాసనాలు వేస్తున్న నగర పౌరులు, విద్యార్థులు

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో ఆదివారం యోగా ఉత్సవం ఘనంగా జరిగింది. యోగా చైతన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర పౌరులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యోగా దినోత్సవానికి వంద రోజుల కౌంట్‌డౌన్‌గా దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా సాగరతీరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగరవాసుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

ఇంధన పొదుపు.. భవితకు మదుపు



సైకిల్‌థాన్‌లో పాల్గొన్న నగర ప్రజలు

ఉత్సాహంగా సైకిల్‌థాన్

బీచ్‌రోడ్డు: గ్రీన్ ఎనర్జీని వినియోగించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్ రాజ్ అన్నారు. హిందూస్థాన్ పెట్రోలియం ఆధ్వర్యంలో సాక్ష్యం–2023 పేరిట ఆదివారం సైకిల్‌థాన్ నిర్వహించారు. ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ సైకిల్‌థాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇంధనం పొదుపు పర్యావరణ పరిరక్షణలో భాగమన్నారు. ఇంధన వినియోగం అధికం కావడంతో దిగుమతి చేసుకునే ముడిచమురు ఎక్కువవుతోందన్నారు. ఇంధన వినియోగం తగ్గించుకోవాలని, అవసరమైన మేరకే వాహనాలను వినియోగించాలని నగర ప్రజలకు సూచించారు. ఎక్కువ శాతం సైకిల్, నడకకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు. హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ డైరెక్ట్ సేల్స్ పురుషోత్తం, వీరభద్రరావు, సాయి కుమార్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డు నుంచే మత్స్యవేట



వల లాగుతున్న మత్స్యకారులు

మహారాణిపేట: చేపల వేట నిషేధం అమల్లో ఉండటంతో.. మత్స్యకారులు తీరం నుంచి వలలతో వేట కొనసాగిస్తున్నారు. జోడుగుళ్లపాలెం తీరంలో ఆదివారం కొంత మంది మత్స్యకారులు తెప్పల్లో కొంత దూరం సముద్రంలోకి వెళ్లి వలలు విసిరారు. వాటిని ఒడ్డు నుంచి లాగారు. తీరం వెంబడి సాగిన వేటలో మత్స్య సంపద సమృద్ధిగా లభించింది. నిషేధ సమయంలో మరబోట్ల ద్వారా సముద్రంలో వేట సాగించడానికి వీలు లేదు. అందుకే జీవనభృతి కోసం మత్స్యకారులు ఈ తరహాలో వేట సాగిస్తున్నారు.

11లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

మహారాణిపేట: ప్రతి పెన్షనర్ ఈనెల 11వ తేదీలోగా ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్(ఈకేవైసీ) చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.డి.ప్రసాదరావు కోరారు. ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే పెన్షన్ మంజూరవుతుందని తెలిపారు. డైరెక్టర్ ఏపీ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ శనివారం టెలీ కాన్ఫరెన్స్‌లో ఇంకా 60 శాతం మంది పెన్షనర్లు ఈకేవైసీ చేసుకోవాలని చెప్పినట్లు వివరించారు. అన్ని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో ఈకేవైసీ అందుబాటులో ఉందని తెలిపారు.

• శ్రమయేవ జయతే..

రక్తాన్ని చిందిస్తూ.. నవ సమాజ నిర్మాణంలో కార్మికుడి భాగస్వామ్యం గొప్పది. అతని చెమట కష్టానికి విలువ కట్టలేం. కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి, పోరాడి సాధించిన రోజు మే డే. కార్మికులను గౌరవిద్దాం. వారి చెమట చుక్క విలువను కాపాడుకుందాం.. కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్,



రైల్వే కాలనీలో డీఆర్ఎం తనిఖీ



డాల్ఫిన్ నోస్ కాలనీలో తనిఖీలు చేస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ సత్పతి ఆదివారం రైల్వే కాలనీలో, న్యూకోచ్ కేర్ సెంటర్‌లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆదివారం డీఆర్ఎం తన సైకిల్‌పై డాల్ఫిన్ నోస్ కాలనీని సందర్శించారు. సిటీఆఫ్ డెస్టినీగా పిలవబడే విశాఖలో పచ్చదనంతో, శుభ్రమైన రైల్వే కాలనీ నిలిచిందని, అయితే దురదృష్టవశాత్తూ కాలనీ అభివృద్ధిలో కాలనీవాసుల భాగస్వామ్యం లేకపోవడం విచారకరమన్నారు. కాలనీ అభివృద్ధికి అంతా సహకరించాలన్నారు. ఈ పర్యటనలో ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ప్రెసిడెంట్ పారిజాత సత్పతి, సీనియర్ డివిజన్ ఇంజినీర్ (హెడ్ క్వార్టర్స్) ఎస్‌కే సారంగి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

న్యూ కోచ్ కేర్ సెంటర్‌లో...

ఆదివారం ఉదయం డీఆర్ఎం కోచ్ కేర్ సెంటర్‌లో కూడా పర్యటించారు. ఈ సందర్భంగా మేకిన్ ఇండియా రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నిర్వహణ పనులను, పరిశుభ్రత విషయంలో తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. అనంతరం కోచింగ్ కాంప్లెక్స్‌లోని ఇతర రైళ్లను కూడా ఆయన తనిఖీ చేశారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతో పాటు సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్‌కే పాత్ర, సీనియర్ కోచ్ డిపో ఆఫీసర్ మోనిష్ బ్రహ్మ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేసవి తాపం.. ఉపశమనం కోసం..



చెట్ల కింద సేదతీరుతున్న జీబ్రా, సింహం

నీడ పట్టునే వన్యప్రాణులు

ఆరిలోవ: భానుడు భగభగమంటున్నాడు. ఎండ తీవ్రతకు జనం అల్లాడుతున్నారు. ఉపశమనం కోసం దారులు వెతుక్కుంటున్నారు. మరి ఇందిరాగాంధీ జూ పార్కులోని వన్యప్రాణుల పరిస్థితి ఏంటి? అవి తిరిగే ఎన్‌క్లోజర్లలోనే నీడను వెతుక్కుంటున్నాయి. అక్కడే సేద తీరుతున్నాయి. ఏనుగులు, పులులు, సింహాలు, జింకలు, అడవి దున్నలు, జిరాఫీలు, జీబ్రాలు, కోతులు ఇలా చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్నీ జూ అధికారులు ఏర్పాటు చేసిన షెడ్‌లు, నీటి కొలనులతో పాటు చెట్ల నీడలోనే ఎక్కువ సేపు గడుపుతున్నాయి. ఉదయం గంట పాటు సందర్శకులను అలరిస్తున్న జంతువులు.. సాయంత్రం 4 గంటల తర్వాతే మళ్లీ బయటకొస్తున్నాయి.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 3న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

అల్లిపురం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మే 3న సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం అల్లిపురంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న రాస్తారోకో కార్యక్రమాలకు సీపీఐ పూర్తి మద్దతు తెలియజేస్తుందన్నారు. మిగిలిన పార్టీలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలియజేయాలని కోరారు. మేడే సందర్భంగా కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనలు తెలియజేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేసి కేంద్రాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలదీయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రితో కలిసి వెళ్తామని తెలిపారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటుపరం చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పూర్తి క్లారిటీగా ఉన్నారన్నారు. సమావేశంలో సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు పాల్గొన్నారు.

10 గంటల నిర్విరామ గీతాలాపన



పాటలు పాడుతున్న గాయకుడు మహమ్మద్ ఖాన్


సీతంపేట: నగరానికి చెందిన ప్రముఖ గాయకుడు మహమ్మద్ ఖాన్ 10 గంటల సేపు నిర్విరామంగా సినిమా పాటలు పాడి రికార్డు సృష్టించారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పడానికి పౌరగ్రంథాలయంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. గీత్ సంగీత్ ఆధ్వర్యంలో 10 గంటల వ్యవధిలో 15 మంది గాయనీమణులతో కలిసి తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం భాషల్లో మహమ్మద్‌ఖాన్ 160 పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. ఉదయం 8.32 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కాగా సాయంత్రం 6.32 గంటల వరకు కొనసాగింది. ప్రోగ్రామ్ కన్వీనర్ కోరుకొండ రంగారావు ఆహ్వానించగా.. ఎంవీఆర్ నాగేశ్వరరావు రికార్డు సమయానికి ముందు ప్రార్థన గీతం ఆలపించారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఎస్.ఎస్.ఎన్.రాజు, యాద్‌కుమార్, గీత, భాస్కరాచారి, మస్తాన్‌రెడ్డి, ఈశ్వరరావు, బాదంగీర్‌సాయి పాల్గొన్నారు. సోమేష్ బృందం వాద్య సహకారం అందించింది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు ఉద్యోగుల మృతి



శ్రీరామమూర్తి మృతదేహం

నగరంలో వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు ఉద్యోగులు మృతి చెందారు. రైల్వే క్యారేజ్ అండ్ వ్యాగన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న వెంకటరావు షంటింగ్ ఇంజిన్ ఢీకొనడంతో, వీఎంఆర్డీఏలో పనిచేస్తున్న శ్రీరామమూర్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు.



వెంకటరావు (ఫైల్)

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. వాల్తేర్ డివిజన్, క్యారేజ్ అండ్ వ్యాగన్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్ (గ్రేడ్ – 1)గా విధులు నిర్వర్తిస్తున్న రాజమండ్రి వెంకటరావు (55)ను షంటింగ్ ఇంజిన్ (లోకో) ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు గవర్నమెంట్ రైల్వే పోలీస్, ఇన్‌స్పెక్టర్ (సీఐ) కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం విధులకు హాజరైన వెంకటరావు 3వ నంబర్ ప్లాట్‌ఫారంపైకి వచ్చిన విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ఇంజిన్ (లోకో) జత చేసేందుకు 4వ నంబర్ ప్లాట్‌ఫారం నుంచి 3వ నంబర్ ప్లాట్‌ఫారం వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో 4వ నంబర్ ప్లాట్‌ఫారంపై ఉన్న దురంతో ఎక్స్‌ప్రెస్‌ను కోచింగ్ సెంటర్‌కు తీసుకెళ్లేందుకు వస్తున్న లోకో (ఇంజిన్) ఢీకొనడంతో వెంకటరావు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అల్లిపురం హార్బర్ కాలనీ, రైల్వే క్వార్టర్స్‌లో నివసిస్తున్న వెంకటరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో..

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో వీఎంఆర్డీఏ ఉద్యోగి మృతి చెందారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివీ.. నక్కవానిపాలేనికి చెందిన బండారి శ్రీరామమూర్తి(60) ద్విచక్రవాహనంపై ఆదివారం అడివివరం వైపు వెళ్లారు. తిరిగి బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమం అతని ముందు వెళుతున్న మరో బైక్‌ను తప్పించబోయి.. ఒకదానికొకటి ఢీకొన్నాయి. రెండు బైక్‌లపై ఉన్న వారు కిందపడ్డారు. శ్రీరామమూర్తి సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచారు. మరో బైక్ నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. శ్రీరామమూర్తికి బలమైన గాయాలు బయటకు కనిపించలేదు. అతని పెట్టుకున్న హెల్మెట్ ఎగిరి పక్కన పడిపోయింది. అతను వీఎంఆర్‌డీఏలో పని చేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.